సాక్షి కర్నూలు

మంగళవారం । 2 । మే । 2023



టీబీ డ్యాంలో 2.7 టీఎంసీల నీరు
హొళగుంద: తుంగభద్ర జలాశయంలో 2.7 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో ఏమీ లేక పోగా ఔట్‌ఫ్లో రూపంలో 220 క్యూసెక్కుల నీరు రాయబసవన కాలువకు వదులుతున్నారు.



శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన
శ్రీశైలం: భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవను నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఉంచి ప్రదక్షిణ నిర్వహించారు.



ఊపిరి.. ఉక్కిరిబిక్కిరి!
ఆస్తమా వ్యాధికి చిన్నా పెద్దా తేడా తెలియదు. ఏ వయస్సు వారినైనా వేధించి ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. నేడు ప్రపంచ ఆస్తమా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.
8లో

న్యూస్‌రీల్

పంచాయతీల్లో విద్యుత్ వినియోగంపై పరిశీలన

కర్నూలు(అర్బన్): జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో విద్యుత్ వినియోగంపై పూర్తి స్థాయిలో పరిశీలన చేస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు 'సాక్షి'తో మాట్లాడుతూ తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలోని వీధుల్లో ఏర్పాటు చేసిన మీటర్లు?(సమీపంలోని ఇంటి యజమాని పేరు), ఈ–మీటరు సర్వీసు నెంబర్?(అది పనిచేస్తుందా, లేదా), సంబంధిత మీటరు పరిధిలో ఎన్ని విద్యుత్ స్తంభాలు ఉన్నాయి? ఈ–మీటరు పరిధిలోని వీధిలైట్లు ఎన్ని? తాజాగా వచ్చిన బిల్లు నెంబర్, తేదీ, ఎన్ని యూనిట్లు వినియోగించారు? అనే వివరాలు సేకరిస్తామన్నారు. అదే విధంగా పాత బకాయిలు, ప్రస్తుత బిల్లు? నీటి పథకాలకు ఉపయోగిస్తున్న విద్యుత్ మోటారు(హెచ్‌పీ వివరాలు), రోజుకు ఎన్ని గంటలు ఈ విద్యుత్ మోటారు పనిచేస్తుంది? తదితర వివరాలను నిర్ణీత ఫార్మెట్‌లో పొందుపరుస్తున్నట్లు వెల్లడించారు.

నిజ బృందావన దర్శనం



తులసీమాల ధారణలో రాఘవేంద్రుల మూల బృందావనం

మంత్రాలయం: ఏకాదశి రోజున భక్తులకు నిజ బృందావన దర్శన భాగ్యం దొరికింది. సంప్రదాయంలో భాగంగా సోమవారం అర్చకులు ఉపవాస దీక్షలో కొనసాగారు. మేడే సెలవు కావడంతో భక్తుల రద్దీ కొనసాగింది. ఆచారం ప్రకారం ఏకాదశి రోజున శ్రీమఠంలో భక్తులకు పరిమళ ప్రసాదం, అన్న ప్రసాదం ఏమీ ఉండవు. భక్తులంతా ప్రయివేటు హోటళ్లలోనే భోజనాలు చేసుకున్నారు. శ్రీమఠం మేనేజర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణిగా వెంకటలక్ష్మమ్మ



కర్నూలు(అర్బన్): జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారిణిగా పి.వెంకటలక్ష్మమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రెగ్యులర్ అధికారిణిగా ఉన్న ఈమె గ్రూప్–1 ప్రిలిమ్స్‌కు అర్హత సాధించి మెయిన్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అయ్యేందుకు ఉన్నతాధికారుల అనుమతితో ఈ ఏడాది ఫిబ్రవరి 14 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు సెలవులో ఉన్నారు. అప్పటి నుంచి ఈమె స్థానంలో బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.నాగేశ్వరరావు అదనపు బాధ్యతలు నిర్వహించారు. సెలవులు ముగిసిన కారణంగా వెంకటలక్ష్మమ్మ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనను కలిసి విధుల్లో చేరారు.

ఉద్యోగులు, పింఛన్‌దారులు ఈ-కేవైసీ చేయించుకోవాలి



రామచంద్రరావు, జిల్లా ఖజానా అధికారి

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగులు, పింఛన్‌దారులు విధిగా తమ సీఎఫ్‌ఎంఎస్ ఐడీలను ఆధార్‌కు లింక్ చేసిన మొబైల్ నెంబర్లతో ఈ–కేవైసీ చేసుకోవాలని జిల్లా ఖజానా అధికారి రామచంద్రరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సీఎఫ్‌ఎంఎస్, హెచ్‌ఈఆర్‌బీ పేరోల్‌కు సంబంధించిన సేవలు పొందాలంటే ఈ అనుసంధానం అత్యవసరమన్నారు. జిల్లాలో 18,540 మంది ఉద్యోగులు ఉండగా.. 5,847 మంది మాత్రమే ఈ–కేవైసీ చేయించుకున్నట్లు చెప్పారు. పింఛన్‌దారులు ఈ–కేవైసీ చేయించుకునేందుకు సంబంధిత సబ్ ట్రెజరీ అధికారులను ఆధార్ కార్డుకు అనుసంధానం చేసిన మొబైల్ నెంబర్‌తో కలవాన్నారు. ఈ నెల 10వ తేదీలోగా ఈ–కేవైసీ ప్రక్రియ 100 శాతం పూర్తి కావాలని కోరారు.

4 నుంచి దేహదారుఢ్య పరీక్షలు

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజా రవాణా శాఖ(ఆర్టీసీ)లో కారుణ్య నియామకాల అభ్యర్థులకు ఈనెల 4 నుంచి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి టి. వెంకటరామం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థలో కానిస్టేబుల్ ఉద్యోగం కోసం విన్నవించుకున్న అభ్యర్థులకు ఈనెల 4, 5వ తేదీల్లో స్థానిక సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ పరీక్షలు నిర్వహిస్తాన్నారు. తమ జోన్ పరిధిలోని ఉమ్మడి కర్నూలు, వైఎస్‌ఆర్ కడప, అనంతపురం జిల్లాలకు చెందిన అభ్యర్థులు అన్ని ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 6గంటలకు సూచించిన గ్రౌండ్‌కు చేరుకోవాలన్నారు.



కొత్తపల్లి మండలం గువ్వలకుంట్ల సమీపంలో పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

వేసవి 'చల్లారి'



బేతంచెర్ల మండలం ముద్దవరం గ్రామంలో దెబ్బతిన్న అరటి తోట

ముంచెత్తిన వర్షం
- ఉమ్మడి జిల్లాలో ఒకేరోజు 61.1 మిల్లీమీటర్ల వర్షం
- నంద్యాల జిల్లాలో 3,329 హెక్టార్ల పంట నష్టం
- ముమ్మరంగా వ్యవసాయ పనులు
- పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు

కర్నూలు(అగ్రికల్చర్): అకాల వర్షంతో వేసవిలోనూ వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. 2019–20 నుంచి ప్రతి ఏటా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో చెరువుల్లో నీరు సమృద్ధిగా ఉంటోంది. భూగర్భ జలాలు కూడా వృద్ధిలోకి వచ్చాయి. ఈ కారణంగా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఎక్కడా నీటి సమస్య ఉత్పన్నం కాలేదు. నైరుతి కంటే ముందే ఉమ్మడి కర్నూలు జిల్లాలో అకాల వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఏప్రిల్ 26న ఉమ్మడి జిల్లాలో వర్షాలు దంచి కొట్టాయి. తాజాగా కర్నూలు, నంద్యాల జిల్లాలో భారీ ఉరుములు, మెరుపులతో ఒక మోస్తరు మొదలు భారీ, అతి భారీ స్థాయి వర్షం కురిసింది. ఆదివారం రాత్రి 11 నుంచి సోమవారం ఉదయం వరకు రెండు జిల్లాల్లో సగటున 61.1 మిమీ వర్షపాతం నమోదైంది. కర్నూలు జిల్లాలో ఒక్క పెద్దకడుబూరు మినహా మిగిలిన అన్ని మండలాల్లో వర్షాలు కురిశాయి కర్నూలు. నగరంలో కుండపోత వర్షం కారణంగా డ్రెయినేజీలు పొంగి పొర్లి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. జిల్లాలో అత్యధికంగా కర్నూలు అర్బన్‌లో 103.2(10.3 సెం.మీ), అత్యల్పంగా హాలహర్విలో 1.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మే నెల సాధారణ వర్షపాతం 40.1 మి.మీ., ఉండగా.. ఒక్క రోజులోనే 28.6 మి.మీ., వర్షం కురవగా.. అత్యధికంగా చాగలమర్రిలో 85.2 మి.మీ., అత్యల్పంగా వెలుగోడులో 12.2 మి.మీ., వర్షం కురిసింది. నంద్యాల జిల్లాకు మే నెల సాధారణ వర్షపాతం 42.5 మి.మీ., ఉండగా ఒక్కరోజులోనే సాధారణం మేరకు 42.5 మి.మీ., వర్షం కురవడం విశేషం.

ముమ్మరంగా వ్యవసాయ పనులు
జిల్లాలో అకాల వర్షాలు కురుస్తుండటంతో రైతన్నలు ఖరీఫ్ సీజన్‌కు సిద్ధమవుతున్నారు. కర్నూలు జిల్లాలో వర్షాధారంపై వ్యవసాయం ఎక్కువగా ఉంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రైతులు గత ఏడాది పంటల వ్యర్థాలు తొలగించడం, వేసవి దుక్కులు చేసుకోవడం, పొలాలకు పశువుల ఎరువులు తోలడం వంటి పనులు నిమగ్నమయ్యారు. ఈ ఏడాది పత్తిపై రైతులు విముఖతతో ఉన్నట్లు తెలుస్తోంది. గత ఏడాది మిర్చి సాగు కలసి రావడంతో రైతులు ఆ దిశగా ఆసక్తి చూపుతున్నారు.

వేసవిలోనూ జలకళ
గతంలో ఎప్పుడూ లేని విధంగా వేసవి మధ్యలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో చెరువులు, కుంటలు, వాగులు, వంకలు జలకళను సంతరించుకున్నాయి. హంద్రీ వెంట ఉన్న కర్నూలు, కల్లూరు, క్రిష్ణగిరి, గూడూరు, సి.బెళగల్ మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. దీంతో హంద్రీనదికి వర్షపు నీరు భారీగా రావడం విశేషం. ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి.



అవుకులో నేలవాలిన వరిపైరు



మద్దికెర మండలంలో నీటితో నిండిన ఫాంపాండ్

కర్నూలు జిల్లాలో నమోదైన వర్షపాతం

మండలం	వర్షపాతం(మి.మీ)
కర్నూలు అర్బన్	103.2
కర్నూలు రూరల్	80.2
క్రిష్ణగిరి	68.2
కల్లూరు	65.4
గూడూరు	58.6
వెల్దుర్తి	56.0
మద్దికెర	48.6
ఓర్వకల్లు	38.2
చిప్పగిరి	34.6
ఆస్పరి	34.4

నంద్యాల జిల్లాలో నమోదైన వర్షపాతం

చాగలమర్రి	85.2
శ్రీశైలం	80.4
జూపాడుబంగ్లా	77.2
నందికొట్కూరు	72.6
బనగానపల్లె	62.4
బేతంచెర్ల	54.8
కోవెలకుంట్ల	54.2
అవుకు	48.6
ఆత్మకూరు	47.2
గోస్పాడు	43.2
నంద్యాల	42.0
పాణ్యం	41.6
శిరివెళ్ల	41.2
పాములపాడు	40.8

నంద్యాల జిల్లాలో 3,329 హెక్టార్లలో పంట నష్టం

అకాల వర్షాలకు నంద్యాల జిల్లాలో పంట నష్టం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. 2022–23 రబీలో నంద్యాల జిల్లాలో వరి, మొక్కజొన్న, మినుము అధికంగా సాగయింది. ప్రస్తుతం కోతలు చురుగ్గా జరుగుతున్నాయి. వారం రోజుల వ్యవధిలో కురిసిన అకాల వర్షాల కారణంగా నంద్యాల జిల్లాలో 3,329 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా. 15 మండలాలు, 74 ఆర్‌బీకేల పరిధిలో పంట నష్టం జరిగింది. దశాబ్దాల క్రితం నుంచి అధిక వర్షాలకు స్టాండింగ్ క్రాప్స్ 33 శాతంపైగా దెబ్బతింటేనే ఇన్‌పుట్ సబ్సిడీ లభిస్తుంది. కోతకోసి నూర్పిడి చేసి ఆరబెట్టిన పంటలు దెబ్బతింటే ఇన్‌పుట్ సబ్సిడీ వర్తించే అవకాశం లేదు. కర్నూలు జిల్లాలో అకాల వర్షాల వల్ల మద్దికెర మండలం అగ్రహారంలో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లింది. కొన్ని ప్రాంతాల్లో గాలుల తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల చెట్లు విరిగిపడ్డాయి.

పీజీ పరీక్షలకు 95 శాతం హాజరు

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న పీజీ పరీక్షలకు సోమవారం 95శాతం మంది హాజరయ్యారు. వర్సిటీతోపాటు ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేసిన ఐదు పరీక్ష కేంద్రాలలో సోమవారం 582 మంది విద్యార్థులకు గాను 554 మంది హాజరైనట్లు పరీక్షల విభాగం అధికారులు తెలిపారు.

నేడు జిల్లా సమీక్ష కమిటీ సమావేశం

కర్నూలు కల్చరల్: జిల్లా సమీక్ష కమిటీ (డీఆర్‌సీ) సమావేశం మంగళవారం ఉదయం 10.30 గంటలకు జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంతో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారని పేర్కొన్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్, హౌసింగ్, రీసర్వే.. తదితరాలు అజెండా అంశాలుగా ఉన్నాయన్నారు.

లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం

- న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటనాగ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జడ్జి వెంకటనాగ శ్రీనివాసరావు, చిత్రంలో ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: లోక్ అదాలత్‌లతో కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు అన్నారు. కర్నూలు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సత్వర న్యాయ మేళా కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటనాగ శ్రీనివాసరావు, ఎస్పీ కృష్ణకాంత్ హాజరయ్యారు. వివిధ కేసుల్లోని కక్షిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జడ్జి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు మాట్లాడుతూ సంవత్సరంలో మొత్తం నాలుగు జాతీయ లోక్ అదాలత్‌లు, మూడు స్పెషల్ లోక్ అదాలత్‌లు ఉంటాయన్నారు. ఈనెల 13వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎలాంటి ఖర్చు లేకుండా కక్షిదారులకు సత్వర న్యాయం అందుకోవచ్చన్నారు. ఎక్సైజ్ కోర్టులో 6 వేల కేసులు పెండింగ్‌లో ఉండి పేరుకుపోతున్నాయన్నారు. ఒక్కొక్క మెజిస్ట్రేట్ కోర్టులో 3,000 నుంచి 4,500 దాకా కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ కేసులన్నీ ట్రయల్‌కు రావాలంటే ఎన్ని సంవత్సరాలు పడుతుందో ఆలోచించాలన్నారు. కక్షిదారులను కూర్చోబెట్టి కష్టనష్టాల గురించి, రాజీ అయితే ఎలా ఉంటుందని తెలియజేయడం కోసం సత్వర మేళా న్యాయ కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించడం చాలా బాగుందన్నారు.

సమయాన్ని వృథా చేసుకోవద్దు
కేసుల పరిష్కారంలో రాష్ట్రంలోనే కర్నూలు జిల్లాను మొదటి స్థానంలో ఉంచే విధంగా కృషి చేస్తామని ఎస్పీ కృష్ణకాంత్ అన్నారు. చిన్న చిన్న కారణాలు, తగాదాలతో కేసులు నమోదయ్యాయని, సమయాన్ని వృథా చేసుకోకుండా మెగా లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లలో ప్రస్తుతం కర్నూలు జిల్లా టాప్–5లో ఉందన్నారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో స్పెషల్ టీమ్‌లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

లోకేష్.. పోటీ చేసి గెలిచే దమ్ముందా?

- వాస్తవాలు తెలుసుకొని మాట్లాడు
- భూ మాఫియా ఇచ్చిన సొమ్ముతోనే పాదయాత్ర చేస్తున్నావు
- ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: భూ మాఫియా ఇచ్చిన సొమ్ముతోనే నారా లోకేష్ పాదయాత్ర చేస్తున్నారని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆరోపించారు. లోకేష్‌కు దమ్ముంటే ఎమ్మిగనూరులో తనపై పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. తాను ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటానని, లోకేష్ ఓడితే రాజకీయ సన్యాసం స్వీకరించాలన్నారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదవడం కాదని వాస్తవాలను తెలుసుకుని లోకేష్ మాట్లాడాలన్నారు. ఎవరు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారనేది ఎమ్మిగనూరు నియోజకవర్గ ప్రజలకు తెలుసన్నారు. తన కుటుంబంపై అవాస్తవ ఆరోపణలు చేసి లబ్ధి పొందాలని చూడటం అవివేకమన్నారు. టీడీపీ పని అయిపోయిందని, కేవలం ఉనికిని కాపాడుకొనేందుకే లోకేష్ పాదయాత్ర చేస్తున్నారన్నారు. కడిమెట్లలో మాన్యం భూమిని లీజుకు తీసుకొని శిస్తు చెల్లిస్తునన్నారు. రాజకీయాలకు అనర్హుడైన లోకేష్‌కు టీడీపీని నడిపే శక్తి లేదని, ఆయనకు వ్యక్తిత్వ వికాసం లేదని ఎద్దేవా చేశారు. జూనియర్ ఎన్టీఆర్ టీడీపీలోకి రావడం ఖాయమని.. భవిష్యత్తులో లోకేష్, చంద్రబాబును రోడ్డున కూర్చోబెట్టే దుస్థితి వస్తుందని జోస్యం చెప్పారు. విలేకరుల సమావేశంలో వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్ పాల్గొన్నారు.

పండుగ తరహాలో వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక



కర్నూలులో ఐరీస్‌తో పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక పంపిణీ సోమవారం ఉదయం నుంచే పండుగ వాతావరణంలో సాగింది. పంపిణీలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా పర్యవేక్షించడంతో పాటు కల్లూరు మండలం పెద్దపాడు సచివాలయం పరిధిలో తలసేమియా పెన్షన్లను డీఆర్‌డీఏ–వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య, అదనపు పీడీ షరీఫ్ పంపిణీ చేశారు. మొదటి రోజునే భారీ ఎత్తున పింఛన్లు పంపిణీ చేయడం విశేషం. గ్రామ, వార్డు వలంటీర్లు ఉదయం 5 గంటలకే పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి నగదును అందచేశారు. పొలాల్లో పనిచేస్తున్న పింఛనుదారులు, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి వద్దకే వెళ్లి వలంటీర్లు పింఛన్ల పంపిణీ చేపట్టారు. సాయంత్రం 5 గంటల సమయానికి కర్నూలు జిల్లాలో 2,38,165 పింఛన్లు ఉండగా.. 1,86,924 మందికి పింఛన్లు అందించారు. 78.49 శాతం పంపిణీ పూర్తయింది. నంద్యాల జిల్లాలో 2,15,670 పింఛన్లు ఉండగా.. 81.84 శాతంతో 1,76,502 పింఛన్లు పంపిణీ చేశారు. ఈ నెల 5వ తేదీ వరకు పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

కార్మిక సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- మేడే వేడుకల్లో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మేయర్ రామయ్య



మేడే సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మేయర్ రామయ్య

కర్నూలు(రాజ్‌విహార్): కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్‌ఖాన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్య అన్నారు. సోమవారం మేడే సందర్భంగా స్థానిక పూలబజార్ సర్కిల్‌లో వేడుక నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి కార్మికులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘటిత, అసంఘటిత కార్మికుల సంక్షేమ కోసం పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం అర్హుల ఖాతాలోకే నేరుగా నగదు జమ చేస్తోందన్నారు. అర్హుల ఎంపికలో ఎలాంటి సిఫార్సులు, రాజకీయాలు, కుల మతాలు చూడకుండా పారదర్శకత పాటిస్తోందన్నారు. భవన నిర్మాణ కార్మికులు, అసంఘటిత కార్మికులందరూ గుర్తింపు కార్డులు పొందాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షాషావలి, షేక్ అహ్మద్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కేదార్‌నాథ్, నాయకులు ఖాదర్ బాషా, నవీన్, హకీమ్, ఫిరోజ్, ఆరీఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సృజన

కర్నూలు కల్చరల్: స్పందన కార్యక్రమానికి వచ్చే సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జేసీ నారపు రెడ్డి మౌర్యతో కలసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్పందనకు మరింత మెరుగైన రూపం జగనన్నకు చెబుదాం కార్యక్రమమన్నారు. స్పందన అయితే అర్జీలను నేరుగా దరఖాస్తు చేసుకుంటారని, కానీ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీదారుడు సమస్యను 1902 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా నమోదు చేసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమస్యలను నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ల ఏర్పాటు
జిల్లా, మండల, డివిజన్ స్థాయిలో అన్ని కార్యాలయాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో జరిగే కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు సీనియర్ ఐఏఎస్ అధికారి రవాణా, ఆర్ అండ్‌బీ సెక్రటరీ ప్రద్యుమ్న ప్రత్యేక అధికారిగా నియమితులయ్యారన్నారు. ఈయన జిల్లాలో రెండు పర్యాయాలు పర్యటించి కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారన్నారు. ఫిర్యాదు చేసిన వ్యక్తికి సంతృప్తి కలిగించేలా సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎక్కువగా రీఓపెన్, రిజెక్టెడ్ అయిన ఫిర్యాదులపై దృష్టి సారించాలన్నారు. డీఆర్‌వో నాగేశ్వరరావు, జెడ్పీ సీఈవో నాసరరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ.18.66 కోట్ల 'ఉపాధి' నిధులు విడుదల

కర్నూలు(అగ్రికల్చర్): ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టే మెటీరియల్ కాంపోనెంట్ కింద ప్రియారిటీ, నాన్ ప్రియారిటీ పనులకు సంబంధించి రూ.18.66 కోట్లు విడుదల య్యాయి. ప్రియారిటీ భవనాలకు సంబంధించి రూ.26.10 కోట్లు పెండింగ్‌లో ఉండగా... రూ.16.38 కోట్లు, నాన్ ప్రియారిటీ పనులకు సంబంధించి రూ.6.78 కోట్లు పెండింగ్‌లో ఉండగా...రూ.2.28 కోట్లు విడుదల అయ్యాయని జిల్లా నీటి యాజమాన్యసంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులకు కూడా త్వరలోనే నిధులు విడుదలవుతాయని పేర్కొన్నారు.

స్పాట్ బిల్లింగ్‌పై ప్రత్యేక దృష్టి

కర్నూలు(రాజ్‌విహార్): స్పాట్ బిల్లింగ్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి సూచించారు. సోమవారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పాట్‌బిల్లింగ్ ప్రక్రియ వారం లోపు పూర్తి చేయాలన్నారు.

ఊపిరి.. ఉక్కిరిబిక్కిరి!

- జిల్లాలో 8 శాతం మందికి ఆస్తమా
- అలర్జీలు, జన్యుపర కారణాలే కారణం
- ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా చికిత్స
- నేడు వరల్డ్ ఆస్తమా డే

ఉబ్బసం, ఆస్తమా, ఆయాసం పేరేదైనా సమస్య ఒక్కటే. అందరిలా ఊపిరి తీసుకోలేకపోవడం. ఈ వ్యాధికి చిన్నా పెద్దా తేడా తెలియదు. ఏ వయస్సు వారినైనా వేధించి ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ప్రతి సంవత్సరం మే నెలలో మొదటి మంగళవారాన్ని ప్రపంచ ఆస్తమా దినోత్సవంగా పరిగణిస్తారు. ఈ సందర్భంగా ఆస్తమా వ్యాధిపై ప్రత్యేక కథనం.



కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆస్తమా బాధితులు

కర్నూలు(హాస్పిటల్): చినుకు పడినా, చల్లగాలి వీచినా ఆస్తమా వ్యాధిగ్రస్తుల బాధ అంతా ఇంతా కాదు. ఊపిరి తీసుకోలేని పరిస్థితుల్లో వారు దగ్గరున్న ఆసుపత్రులకు, తెలిసిన వైద్యుల వద్దకు వెళ్తుంటారు. వెంటనే వారికి ఓ చిన్న ఇంజెక్షన్ లాంటి మందును ఆక్సిజన్ మాస్క్‌లో వేసి అందజేసి అప్పటికప్పుడు ఉపశమనం కలిగిస్తారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌ల వద్ద ఇలా మాస్క్‌లు ధరించి కూర్చున్న వ్యక్తులు మనకు కనిపిస్తూనే ఉంటారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 18 శాతం మంది వివిధ రకాల ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్నారు. ఇందులో కేవలం ఆస్తమా జబ్బుతోనే 8 శాతం మంది(4లక్షల మంది) ఇబ్బంది పడుతున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు.

అంటు వ్యాధి కాదు

ఆస్తమా అంటువ్యాధి కాదని, రోగనిరోధక వ్యవస్థలోని మార్పుల పరిస్థితి వల్ల వచ్చే అలర్జీ అని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ మందికి జన్యుపరమైన కారణాలతోనే ఇది వస్తుంది. వైద్యులు సూచించిన మేరకు మందులు వాడితే సాధారణ జీవితాన్ని గడిపేందుకు ఆస్కారం ఉంటుంది. నిర్లక్ష్యం చేస్తే మాత్రం ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్లు వచ్చేందుకు ఆస్కారం ఉంది.

లక్షణాలు ఇవీ..

దుమ్ము, ధూళి, పొగ, వాతావరణ మార్పుల కారణంగా వ్యాధిగ్రస్తుల ఊపిరితిత్తుల్లోని గాలి గొట్టాల్లో వాపు కనిపిస్తుంది. దీంతో దగ్గు, పిల్లికూతలు, ఆయాసం, ఛాతీ బిగించినట్లు పట్టేయడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. లక్షణాలు ఉన్న వారికి రోగనిర్ధారణకు వైద్య పరీక్షలు చేస్తారు. అలర్జీ కారకాన్ని గుర్తించేందుకు అలర్జీ చర్మ పరీక్ష చేయాల్సి ఉంటుంది. అయితే ఆయాసం ఉన్నంత మాత్రాన ఆస్తమా ఉందనుకోవడం సరికాదు. వెంటనే మెడికల్‌షాప్‌కు వెళ్లి స్టిరాయిడ్స్ మాత్రలు, ఇన్‌హేలర్లు వాడటం చేయకూడదు.

వ్యాయామం తప్పనిసరి

ఆస్తమా ఉన్న వారు వ్యాయామం తప్పనిసరిగా చేయాలి. ఫలితంగా రక్తప్రసరణ పెరుగుతుంది. కేలరీలు వినియోగమై బరువు తగ్గుతారు. బరువు తగ్గే కొద్దీ ఆస్తమా ప్రభావం తగ్గుతుంది. రక్తప్రసరణ పెరగడం వల్ల మంచి ఆక్సిజన్ అంది అవయవాలన్నీ శక్తిమంతమవుతాయి. అలర్జీలనే కాదు ఇన్‌ఫెక్షన్‌లను కూడా శరీరం తట్టుకోలదు.

పెద్దాసుపత్రిలో ఉచితంగా చికిత్స



ఆస్తమాకు అవసరమైన అన్ని రకాల మందులు, చికిత్స కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అందుబాటులో ఉన్నాయి. ముందుగా ఆస్తమాతో వచ్చిన వారికి క్యాజువాలిటీలోనే నెబులైజర్ ద్వారా నెబులైజేషన్ పెడతాం. తగ్గకపోతే వెంటనే అడ్మిట్ చేసుకుని చికిత్స అందిస్తాం. ఇన్‌ఫెక్షన్స్ ఉంటే యాంటిబయాటిక్స్ ఇస్తాం. అవసరమైతే నాన్ ఇన్‌వాసివ్ వెంటిలేటర్ అమరుస్తాం. రోగి అపస్మారక స్థితికి వెళ్తే వెంటిలేటర్ కూడా ఏర్పాటు చేస్తాం. ఇలాంటి చికిత్సకు ప్రైవేటుగా రోజుకు రూ.30వేల నుంచి రూ.40వేల దాకా ఖర్చు అవుతుంది. ఇంత ఖరీదైన చికిత్సను పెద్దాసుపత్రిలో ఉచితంగానే అందిస్తున్నాం.

–డాక్టర్ ఎం. వెంకటరావు, టీబీసీడీ విభాగం హెచ్‌వోడీ, జీజీహెచ్, కర్నూలు

ఆధునిక మందులు



పిల్లల్లో(చైల్డ్ ఆస్తమా), యవ్వనస్తుల్లో(లేట్ ఆస్తమా)గా పరిగణిస్తారు. ఇందులో దగ్గు, కఫం పడటం, ఊపిరితీసుకోవడంలో ఇబ్బంది, పిల్లికూతలు ఎక్కువ రావడంతో పాటు తుమ్ములు, తలనొప్పి, ముక్కులు మూసుకుపోవడం కూడా తరచుగా చూస్తుంటాము. రోగి లక్షణాల తీవ్రతను బట్టి చెస్ట్ ఎక్స్‌రే, పల్మనరి ఫంక్షన్ టెస్ట్‌ల ద్వారా ఆస్తమా వ్యాధిని నిర్ధారిస్తారు. దానికి తగ్గట్లుగా ఇన్‌హేలర్, నెబులైజేషన్ పద్ధతుల ద్వారా ఆస్తమాను నియంత్రించవచ్చు. బ్రోన్కియాల్ థెర్మోప్లాస్టీ, బయోలాజికల్ ఇమ్యునోథెరపి వంటి అత్యాధునిక పద్ధతుల ద్వారా మొండి రకం ఆస్తమా జబ్బును నియంత్రించవచ్చు.

–డాక్టర్ కె. వరప్రసాద్, పల్మనాలజిస్టు, కర్నూలు

ఇన్‌హేలర్లతో నివారణ



ఆస్తమా వ్యాధికి మందుల కంటే ఇన్‌హేలర్లే ప్రభావంతంగా పనిచేస్తాయి. దేశంలో 20 నుంచి 30 శాతం మంది ఆస్తమాతో బాధపడుతున్నారు. ఆస్తమాకు సొంత వైద్యం చేసుకోకుండా దగ్గరలోని వైద్యులను కలిసి చికిత్స తీసుకోవాలి. పీల్చే మందుల ద్వారా 90 శాతం వరకు ఉపశమనం లభిస్తుంది. మిగిలిన 10 శాతం నివారణ చర్యలు, జాగ్రత్తలు వల్ల నయం అవుతుంది. సరిగ్గా మందులు వాడకపోతే న్యూమోనియా, ఊపరితిత్తుల ఇన్‌ఫెక్షన్ తదితర సమస్యలతో ఇబ్బంది పడే అవకాశం ఉంది. కాగా కోవిడ్ అనంతరం పిల్లల్లో ఆస్తమా కేసులు పెరుగుతున్నాయి. పాఠశాలల్లో వ్యాయామం చేయించకపోవడం వల్ల కేసులు ఎక్కువవుతున్నాయి.

–డాక్టర్ కె.శివకృష్ణ, పల్మనాలజిస్టు, కర్నూలు

బాధ్యతలు చేపట్టిన న్యాయమూర్తి

కర్నూలు(లీగల్): కర్నూలు ఎక్సైజ్ న్యాయమూర్తిగా పఠాన్ సియాజ్ ఖాన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న కె.భార్గవిని కడపకు బదిలీ చేసి ఆమె స్థానంలో డోన్‌లో పనిచేస్తున్న పఠాన్ సియాజ్ ఖాన్‌ను వారం క్రితం హైకోర్టు నియమించింది. దీంతో ఆయన బాధ్యతలు చేపట్టారు.

మైనింగ్ కార్యాలయం ప్రారంభం



మైనింగ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: జిల్లా కేంద్రం నంద్యాల పట్టణంలోని క్రాంతి నగర్‌లో భూగర్భ గనుల శాఖ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల నూతన జిల్లా కావడంతో మైనింగ్ కార్యాలయంలో ఏర్పాటు చేశామన్నారు. నేటి నుంచి జిల్లా మైనింగ్ కార్యాలయం గనుల లీజుదారులకు అందుబాటులో ఉంటుందన్నారు. బనగానపల్లె, బేతంచెర్ల, ప్యాపిలి, డోన్ మండలాలు మినహా మిగిలిన మండలాల గనుల లీజుదారులందరూ జిల్లా మైనింగ్ కార్యాలయం నుంచే అనుమతులు పొందాలిసి వుందన్నారు. మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లో మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారన్నారు. కార్యక్రమంలో కర్నూలు భూగర్భ గనుల శాఖ డీడీ రాజశేఖర్, నంద్యాల జిల్లా మైనింగ్ అధికారి రామచంద్ర, విజిలెన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

'టిష్యూ' అరటిలో ఫర్టిగేషన్ లాభాలు

- నిర్ణీత మోతాదులో రోజువారీగా ఇవ్వాలి
- ఏపీఎంఐపీ ఏపీడీ రాజా కృష్ణారెడ్డి



ఫర్టిగేషన్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎంఐపీ ఏపీడీ రాజాకృష్ణారెడ్డి

కర్నూలు అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాలో టిష్యూ కల్చర్ అరటి సాగు విస్తరిస్తోంది. ఇప్పటికే 10 వేల ఎకరాల్లో సాగు ఉంది. సూక్ష్మ సేద్యం కింద చేపట్టే సాగులో ఫర్టిగేషన్‌కు అత్యంత ప్రాధాన్యత ఉంది. సూక్ష్మ, స్థూల ఎరువులను నీళ్లలో కరిగించి వేర్ల దగ్గర అవసరమైన మోతాదులో మొక్కలకు ఫర్టిగేషన్ ద్వారా అందించవచ్చు. ఈ విధానం ద్వారా ఎరువుల వృథాను అరికట్టడమే గాక కలుపును నివారించుకోవచ్చు. మొక్కలకు ఎరువులు ఎంత మోతాదులో ఇవ్వాలనే దానిని ఏపీఎంఐపీ అసిస్టెంటు ప్రాజెక్టు డైరెక్టర్ రాజాకృష్ణారెడ్డి వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

వేర్లు పోషకాలను ద్రవ రూపంలో మాత్రమే తీసుకుంటాయి. ఘన రూపంలో తీసుకోలేవు. ఫర్టిగేషన్ చేయడం వల్ల మొక్క బలంగా ఎదిగి మంచి దిగుబడి వస్తుంది. టిష్యూ కల్చర్ అరటి పంటకాలం 10 నుంచి 12 నెలలు ఉంటుంది. మొదటి పంట 11 నెలలకు మొదలవుతుంది. అందువల్ల రైతులు అందించే మొత్తం ఎరువు మోతాదులో 60 శాతం పైగా ఆరు నెలల్లోపే అందించాల్సి ఉంది. ఆలోపే గెలలో ఎన్ని హస్తాలు, కాయల సంఖ్య నిర్ణయం జరిగి ఉంటుంది. తర్వాత హస్తాల సంఖ్య మారదు. మారేది కాయల సైజు, బరువు మాత్రమే. ప్రతి అరటి మొక్క 14–15 ఆకులతో బాగా విస్తారంగా ఉంటే ప్రతి గెల 20 కిలోలకుపై బరువు తూగుతుంది. ఒకసారి గెల బయటికి వచ్చిన తర్వాత పొటాష్ ఆవశ్యకత పెరుగుతుంది. అందువల్ల పొటాష్ ఎరువులను గెలపై కూడా పిచికారీ చేయాల్సి ఉంటుంది. ఈ మధ్య కాలంలో బోరాన్ పోషకాల అవసరం పెరుగుతున్నందువల్ల 0.1 శాతం బోరాక్స్ ద్రావణాన్ని గెలవేసిన తర్వాత మూడు దఫాలుగా పిచికారీ చేయాల్సి ఉంటుంది. రసాయన ఎరువులతో పాటుగా సేంద్రియ ద్రావణాలను అందిస్తే ఉత్తమ ఫలితాలను పొందవచ్చు. ప్రధానంగా వర్మివాష్, హూనమిక్ ఆమ్లంను డ్రిప్ ద్వారా అందింస్తే నేలలో సూక్ష్మ జీవుల సంఖ్య పెరిగి అన్ని పోషక పదార్థాలను వేర్లకు అందుబాటులో ఉంచుతాయి.

రోజువారీగా ఇవ్వాల్సిన ఎరువులు...

- టిష్యూ కల్చర్ అరటి సాగులో 35వ రోజు నుంచి 60వ రోజు వరకు ప్రతిరోజు 19:19:19 ఎరువు కిలో, యూరియా 2 కిలోలు, అమ్మోనియం సల్ఫేటు 4 కిలోలు, మెగ్నీషియం సల్ఫేటు 2 కిలో ఇవ్వాలి.
- 61వ రోజు నుంచి 135వ రోజు వరకు 12:61:00 ఎరువు ప్రతిరోజు 750 గ్రాములు, యూరియా రెండు కిలోలు, 13:00:45 ఎరువులు 250 గ్రాములు, ఎంటపీ కిలో, మెగ్నీషియం సల్ఫేటు ఒక కిలో ప్రకారం ఇవ్వాలి.
- 136వ రోజు నుంచి 185 రోజు వరకు 0:52:34 ఎరువు 500 గ్రాములు, పాస్పరిక్ ఆసిడ్ 250 గ్రాములు, యూరియా 2 కిలోలు, 13:00:45 ఎరువు 500 గ్రాములు, మెగ్నీషియం సల్ఫేటు కిలో ప్రకారం ఇవ్వాలి.
- 186వ రోజు నుంచి 285 రోజు వరకు 13:00:45 ఎరువు 2 కిలోలు, ఎంటపీ(తెలుపు) ఒక కిలో ప్రకారం ఇవ్వాలి.

ఉద్యోగం పేరుతో మోసం

- స్పందనలో ఎస్పీకి బాధితుల ఫిర్యాదు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని ఒక వ్యక్తి డబ్బులు తీసుకుని మోసం చేశాడని కర్నూలు ధనలక్ష్మి నగర్‌కు చెందిన ఉదయ్ కుమార్, మండల సర్వేయర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకుని ఓ వ్యక్తి మోసం చేశాడని పత్తికొండ మండలం హోసూరు గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ ఎస్పీ కృష్ణకాంత్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ఎస్పీ సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 93 ఫిర్యాదులు వచ్చాయి. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నిటిపై చట్టపరిధిలో విచారణ జరిపి సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని ఎస్పీ హామీ ఇచ్చారు. ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు తదితరులు కూడా స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్పందనకు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- భూమికి సంబంధించి నకిలీ పట్టా ఇచ్చి ఒక వ్యక్తి తనను మోసం చేశాడని కర్నూలు మండలం బి.తాండ్రపాడుకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి పి.జగన్నాథుడు ఫిర్యాదు చేశారు.
- తన బాగోగులు పట్టించుకోకుండా కుమారులు అన్నం కూడా పెట్టకుండా వేధిస్తున్నారని ఆలూరు మండలం మన్నెకుర్తి గ్రామానికి చెందిన ఎల్లమ్మ ఫిర్యాదు చేశారు.
- భర్త బతికున్నప్పుడు పొలం కొనుగోలుకు ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తుగ్గలి మండలం బొందిమడుగుల గ్రామానికి చెందిన లక్ష్మీదేవి ఫిర్యాదు చేశారు.

రీ ప్లాంటేషన్ సర్జరీ విజయవంతం

- తెగిన వేలిని అతికించిన శాంతిరాం సూపర్ స్పెషాలిటీ వైద్యులు



ప్రమాదంలో తెగిన బొటనవేలు



సర్జరీ తర్వాత చేతికి అతికిన బొటనవేలు

నంద్యాల(అర్బన్): మెట్రో పాలిటిన్ నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉండే రీ ప్లాంటేషన్ సర్జరీని నంద్యాల శాంతిరాం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి ప్లాస్టిక్ సర్జరీ నిపుణులు శ్రీహర్ష తెలిపారు. ఇటీవల నంద్యాల పట్టణానికి చెందిన ఓ మెకానిక్ బైక్ రిపేరు చేస్తుండగా ఎడమ చేతి బొటన వేలు చైన్‌లో చిక్కుకొని తెగిపోయింది. వేలును భద్రంగా ఆసుపత్రికి తీసుకొని రావడంతో వెంటనే ఆసుపత్రి ప్లాస్టిక్ సర్జరీ నిపుణులు డాక్టర్ శ్రీహర్ష మైక్రో వ్యాక్యూలర్ సర్జరీ విధానం ద్వారా 10 గంటలు శ్రమించి అదే స్థానంలో ఉంచి ఆపరేషన్ చేశారు. తెగిపోయిన వేలును సకాలంలో ఆసుపత్రికి తీసుకొని రావడంతోనే ఆసుపత్రి వైద్య బృందం సహాయంతో రీ ప్లాంటేషన్ సర్జరీ చేసి బొటన వేలును అతికించడానికి వీలైందని డాక్టర్ శ్రీహర్ష తెలిపారు. ఇలాంటి సర్జరీ నంద్యాల జిల్లాలో మొదటి సారి చేశామన్నారు. ప్రమాదవశాత్తు శరీరంలోని ఏ భాగమైనా తెగి వేరైనప్పుడు ఆ వ్యక్తితో పాటు తెగిన భాగాన్ని భద్రపరిచి 8 గంటల్లోపు ఆసుపత్రికి తీసుకొవస్తే మైక్రో వ్యాక్యూలర్ సర్జరీ విధానంతో రీ ప్లాంటేషన్ చేస్తామన్నారు.

అదృశ్యమైన బాలుడు రాము ఆచూకీ లభ్యం

మంత్రాలయం: తుంగభద్ర పాత రైల్వేస్టేషన్ ముఖద్వారంలో అదృశ్యమైన ఏడు నెలల బాలుడు రాము ఆచూకీ లభ్యమైంది. దీంతో తల్లిదండ్రులు వడ్డె ఆంజనేయులు (అంజి), అంకమ్మ సంతోషం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా నుంచి పదేళ్ల క్రితం వచ్చిన వీరు తుంగభద్ర పాత రైల్వే స్టేషన్‌తో తలదాచుకుంటూ భిక్షాటనతో జీవనం సాగిస్తున్నారు. శనివారం తెల్లవారుజామున వీరి కుమారుడు రాము కనిపించకుండా పోవడంతో రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు రంగంలోకి దిగి తుంగభద్ర గ్రామంలోని కృష్ణారెడ్డి ఫర్టిలైజర్ షాపులో సీసీ పుటేజీను పరిశీలించారు. వేకువజాము 4.30 గంటల ప్రాంతంలో ఇద్దరు అనుమానిత యువకులు బైకుపై వెళ్లినట్లు గుర్తించి నంబర్ ఆధారంగా దర్యాప్తు సాగించారు. మంత్రాలయం మండలం రాంపురం గ్రామానికి చెందిన యువకుడి బైకుగా గుర్తించి ఆరా తీయగా.. బిచ్చాల యువకుడితోపాటు మరో యువకుడు ఊర్లెళ్లేందుకు బైకును తీసుకెళ్లినట్లు తేలింది. వారిద్దరూ బైకు కనిపించకుండా రైల్వే స్టేషన్ దక్షిణభాగంలో చీకట్లో పెట్టి.. తుంగభద్ర పాత రైల్వేస్టేషన్ ముఖద్వారంలో నిద్రిస్తున్నట్లు నటించి వేకువజామున బాలుడిని అపహరించారు. రైల్వే స్టేషన్ నుంచి బైకుపై రాంపురం వెళ్లారు. అక్కడ బైకును అప్పగించి బాలుడితో పరారయ్యారు. సీసీ పుటేజీలో దుండగుల ఫొటోల ఆధారంగా రాయచూరులో వీరిని పోలీసులు అదుపులోకి తీసుకుని గుంతకల్లుకు తీసుకొచ్చినట్లు సమాచారం. బాలుడిని కూడా వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకుని సోమవారం సాయంత్రం రైల్వే కానిస్టేబుల్ పరశురామ్‌తో కలిసి బాధిత తల్లిదండ్రులు గుంతకల్లు బయలుదేరారు.


చెరువులో పడిపోయిన లారీ

- అదుపుతప్పిన ఆటో..ముగ్గురికి గాయాలు



తుగ్గలి: రాతన చెరువుకట్ట మీద సోమవారం ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి అదుపుతప్పి లారీ చెరువులోకి పడిపోయింది. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. ఆటో అదుపుతప్పడంతో డ్రైవర్ ఫక్కీరప్పకు కాలు విరిగిపోయింది. ఆటోలో ఉన్న ఆయన భార్య, చిన్నారికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం ఫక్కీరప్ప, చిన్నారిని మెరుగైన వైద్యం కోసం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. తుగ్గలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య



వినీలమ్మ మృతదేహం

కర్నూలు: నగరంలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన గోకవరం వినీలమ్మ అలియాస్ లావణ్య (25) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కర్నూలు మూడో పట్టణ ఎస్‌ఐ వెంకట సురేష్ తెలిపిన వివరాల మేరకు.. ముచ్చుమర్రి గ్రామానికి చెందిన ప్రభాకర్, రాహేలమ్మ దంపతుల కుమార్తె అయిన వినీలమ్మను కర్నూలు శ్రీరామ్‌నగర్‌కు చెందిన బండారి హరీష్‌రాజుకు 2001 డిసెంబర్‌లో ఇచ్చి వివాహం జరిపించారు. హరీష్ రాజు కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పెళ్లి సందర్భంగా రూ.లక్ష నగదు, తులం బంగారం కట్నంగా ఇచ్చారు. భర్త బండారి హరీష్‌రాజు, అతని తల్లి వెంకటేశ్వరమ్మ, తమ్ముడు మహేష్.. వినీలమ్మ పట్ల అనుమానపడుతుండేవారు. ఆ బాధలు భరించలేక ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకుంది. కుటుంబ సభ్యులు ఆలస్యంగా కనుక్కొని ఉరి నుంచి తప్పించేసరికి మృతిచెందింది. మృతురాలి తమ్ముడు గోకవరం వినోద్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.